
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 మే 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





అక్రమ కేసులను అరికట్టండి..!

కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :జిల్లాలో ఇటీవల కాలంలో పత్రికా విలేకర్లపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఈ విషయంలో జోక్యం చేసుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కలెక్టర్ ఎం హరినారాయణన్‌కు జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో సీనియర్ పాత్రికేయులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఎస్‌పితో మాట్లాడతానని, న్యాయపరంగా వ్యవహరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు కొలగట్ల సుధాకర్, కొల్లూరు వెంకటేశ్వర్లు, పి బాలకృష్ణ, కె దయాశంకర్, మునీంద్ర, శ్రీధర్‌రెడ్డి, దేవా, జయరామ్ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'..!

జగన్నకు చెబుదాం అంటూ ప్రజలు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం లాంఛనీయంగా ప్రారంభమైంది. జిల్లా వ్యాపితంగా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. కానిస్టేబుల్ నుంచి ఎస్‌పి దాక, వీఆర్‌ఓ నుంచి కలెక్టర్ దాకా, గ్రామ నాయకుడు నుంచి ఎంఎల్‌ఎలు దాక సమస్యలు తెలిసినా పరిష్కారం కావడంలేదంటున్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాట ధర దక్కడం లేదు. బెల్ట్ షాపులతో సాధారణ ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. గ్రావెల్, ఇసుక, సిలికా, ఒక్కటేమి అంతా దోపిడీ సాగుతున్నా పట్టించుకోవడం లేదు. నుడా పరిధిలో అక్రమ లేవుట్లలో వెలసి కోర్టు ఆదేశాలున్నా పట్టించుకోవడంలేదు నిర్మాణాలు సాగుతున్నాయి. పంటకు సాగునీరు సమస్యగా ఉంది. ఇన్ని సమస్యలున్నా ఓట్లేసి గెలిపించిన మా ఎంఎల్‌ఎలు మాట్లాడడం లేదంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాలను జగనన్నకు చెబుదాం, అంటూ ప్రజలు సిద్ధమవుతున్నారు. నేరుగా కలిసి మొరపెట్టుకున్నా పరిష్కారం కాని సమస్యలు ఒక్క ఫోన్‌కాల్‌తో తీరుతాయా అని ఆశగా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- రైతుకు మద్దతు ధర లేదన్నా..
- అక్రమ లేవుట్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నా..
- గ్రావెల్, ఇసుక, సిలికా దోపిడీ సాగుతోందన్నా..
- వీధిలైట్లు అందుబాటులో లేవన్నా..
- ఎంఎల్‌ఎలు సమస్యలు వినడం లేదన్నా..



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక వ్యవస్థలు పనిచేస్తున్నాయి. పోలీసు, రెవెన్యూతోపాటు రాజకీయ వ్యవస్థ ఇందుకోసం పనిచేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో స్పందన, గ్రీవెన్స్ డే అంటూ ప్రతి సోమవారం నిర్వహిస్తుంది. జిల్లాలో కూలీ, నాలీ జనం ఉదయమే కిలో మీటర్ల నుంచి వచ్చి అర్జీలు పట్టుకొని అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. గ్రామ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ఏమైనా కావచ్చు. కొన్ని పరిష్కారం అవుతున్నాయి. మరికొన్ని దేనికీ నోచుకోవడం లేదు. రోజులు, నెలలు, సంవత్సరాలు ప్రకారం అర్జీలు పట్టుకొని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తిరుగుతున్నారు. గతంలో టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వంలోనూ ఇదే సాగుతోంది. రాజకీయ పలుకుబడి, అధికారం బలంగా ఉన్న వ్యక్తులకు మాత్రమే పనులు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. భూమి, సాగునీటి, మద్యం, రేషన్ కార్డు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాల కోసం నిత్యం తిరుగుతూనే ఉంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కొందరికి పథకాలు అమలు చేయడానికి ఇబ్బందులున్నాయి. తిరిగి తిరిగి వేసారి జనం రాజకీయ నేతల వద్దకు వెళ్లి సిఫార్సులు చేయించుకొని అధికారుల వద్దకు వెళుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం " జగనన్నకు చెబుదాం" అంటూ తీసుకొచ్చిన పథకంతో తమ సమ్యలు పరిష్కారం అవుతాయా? పాత పద్ధతుల్లోనే సాగుతాయా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నాం 'రావాలి జగన్...కావాలి జగన్ ' అంటూ జనం 2019 ఎన్నికల్లో ఆపార్టీకి ఘన విజయం ఇచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇద్దరు ఎంపిలు, 10 మంది ఎంఎల్‌ఎలు, జెడ్‌పి ఛైర్మన్, 46 మంది జెడ్‌పిటిసిలు, మేయర్, ఛైర్‌పర్సన్‌లతోపాటు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు దాదాపు 90 శాతం వైసిపి పక్షాన గెలిచారు. రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు ఏ పార్టీకి ఇంతటి మెజార్టీ రాలేదు. ప్రజలు తమకేదైనా సమస్యలు వస్తే, ప్రజా ప్రతినిధులు చట్టసభలు, సమావేశాల్లో మాట్లాడి సాధించి పెడతారని నమ్మారు. ఈ నేతలు చెప్పిన పనులే జరగడం లేదని ఆవేదన చెందుతున్నారు. నిధుల్లేవ్, విధులు తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులకే పనులు జరగడం లేదంటూ వాపోతున్నారు..



జగన్నకు చెబుదాం..!

ఎన్నో ఏళ్ల నుంచి రైతులకు మద్దతు ధర కలగానే మిగిలిపోతుంది. కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వంలో ధర కోసం ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి వరకు రాయబారాలు సాగాయి. ప్రతేడాది 40 లక్షల పుట్లు దిగుబడి వస్తే, మద్దతు ధర కోసం ప్రతేడాది పోరాటం చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర విషయాన్ని పట్టించుకోకుండా మిల్లర్లు, దళారులు వారికి నచ్చిన ధర ఇచ్చి ప్రతేడాది కోట్లది రూపాయాలు రైతుల శ్రమను దోచుకుంటున్నారు. కొంత మేలు జరగాల్సిన నెల్లూరు మసూరి విషయంలో అన్యాయం జరిగింది. ఒక్కసారి రైతుల మద్దతు ధర గురించి పట్టించుకో జగనన్న అంటూ రైతులు వేడుకుంటున్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిదిలో ఇటీవల కాలంలో విచ్చలవిడిగా అక్రమ లేవుట్లు వెలిశాయి. అనధికార లెక్కల ప్రకారం 200 వరకు ఉంటాయని చెబుతుండగా, అధికారికంగా 118 ఉన్నట్లు ఆశాఖ అధికారులు గుర్తించారు. పేద, మధ్య తరగతి ప్రజలు సొంతింటి కల కోసం అప్పులు చేసి, బ్యాంకుల్లో బంగారం కుదువపెట్టి ప్లాట్లు కొనుగోలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలపై హైకోర్టు స్టే ఇచ్చినా పట్టించుకోకుండా నిర్మాణాలు సాగిపోతున్నాయి. అధికారుల పార్టీనేతలు ముందుండి నడిపిస్తున్నారని విమర్శలున్నాయి. మీరు పట్టించుకోకపోతే మధ్య తరగతి ప్రజల జీవితాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్, ఇసుక, సిలికా అక్రమ రవాణా సాగుతోంది. రైతులు, ప్రజలు , రాజకీయ నేతలు మొరపెట్టుకున్నా ఆగడం లేదు. ఒక్క అధికారి వెళ్లి ఆపే పరిస్థితి చేయడం లేదు. అధికారపార్టీ నేతలకు భయపడి మౌనంగా ఉంటున్నారని ప్రచారం సాగుతోంది. మీరు ఇచ్చిన నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు, మున్సిపాలిటీల్లోనూ మొత్తం వైసిపి వశమయ్యాయి. అక్కడ కనీసం వీధి దీపాలకు డబ్బులు లేక, ఇంటింటికి తిరిగి విరాళాలు వసూళ్లు చేసుకొని దీపాలు వేసుకుం టున్నారు. ఇలాంటి సమస్యలతో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారనైనా ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశపడుతున్నారు. ఏం జరుగుతుందో చూడాలి..

ప్రజలు'జగనన్నకు చెప్పండి'..!

పటిష్టమైన నిర్వహణ చేస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరుప్రతినిధి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజలు తమ సమస్యలను నేరుగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పుకోవచ్చునని, కలెక్టర్ ఎం. హరి నారాయణన్ తెలిపారు. బుధవారం తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు మరింతగా మెరుగైన పరిష్కార మార్గం చూపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 9వ తేదీన "జగనన్నకు చెబుదాం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలు తమ సమస్యల పరిష్కానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలు తెలుసుకునేందుకు, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించి సత్వరం పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేయడం గాని, లేదా సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో గాని లేదా ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో నిర్వహించు " జగనన్నకు చెబుదాం " కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి అందిన అర్జీలను పరిష్కరించేందుకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హత ఉండి సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు ప్రభుత్వ సేవల సమస్యలకు సంబంధించిన అంశాల పై ఫిర్యాదు చేయొచ్చని, ఫిర్యాదు చేసిన వాటికి వైఎస్సార్ యూనిక్ ఐడీని కేటాయించడంతో పాటు సదరు సమస్యను ఏ దశలో ఉందని ఫిర్యాదారునికి ఐవిఆర్ఎస్ ద్వారా తెలుపుతూ సమస్య పరిష్కారం కోసం కషి చేయడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుల పరిష్కారం విధానంపై మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ కమిటీలు పనిచేయడంతో పాటు పరిష్కరించబడిన ఫిర్యాదు సంతప్తికరంగా పరిష్కరించబడినది లేనిది ఫీడ్ బ్యాక్ విధానంలో తెలుసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. గ్రామ స్థాయిలో కమ్యూనిటీ సంబంధ సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదని, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ సేవల సమస్యలకు సంబంధించిన అంశాల పై ప్రజలు ఫిర్యాదు చేయొచ్చని, ప్రజల సమస్యలను మానవత్వ దష్టిలో పరిష్కారం చూపాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి-నెల్లూరు :క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణకు ప్రజలంతా సహకరించాలని, బహిరంగంగా వ్యర్థాలు వేస్తే వీధిలోని స్థానికులందరికీ జరిమా నాలు విధిస్తామని కమిషనర్ కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక 51 వ డివిజను సుబేదారు పేట శానిటేషన్ మస్టర్ పాయింట్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, సూపర్ వైజర్లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను అడ్డుకుంటాం : ఆర్‌పిఐ

ప్రజాశక్తి-నెల్లూరు : ఇరిగేషన్ శాఖలోని లస్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 12న కావలిలో జరగనున్న సిఎం పర్యటనను అడ్డుకుంటామని ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె మాబు హెచ్చరించారు. నెల్లూరులోని ఇరిగేషన్ కార్యాలయంలో ఆందోళనలు చేస్తున్న లస్కర్లకు బుధవారం ఆర్‌పిఐ జిల్లా నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం లస్కర్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్‌కె మాబు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి చిన్న ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. సలహాలు ఇచ్చేందుకు సలహాదారుల పేరుతో ప్రభుత్వం ప్రతి నెలా రూ.కోట్లు జీతాలుగా చెల్లిస్తోందని, క్షేత్రస్థాయిలో రైతులకు సేవలందిస్తున్న లస్కర్లకు మాత్రం జీతాలు ఇవ్వలేకపోతోందని మండిపడ్డారు. లస్కర్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో లస్కర్లు, రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రి చూస్తూ ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోవూరు సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు మాలకొండయ్య, ఉప్పులూరు యూత్ వింగ్ అధ్యక్షులు ముసలి జయరాజ్, దాసరి రత్నం, నవీన్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -ఉలవపాడు : వేసవి శిక్షణ తరగతులలో భాగంగా బుధవారం ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో ముందుగా పిల్లలతో పుస్తక పఠనం చేయించి, నీతి కథలు చెప్పించి అనంతరం వారి కోరిక మేరకు చిత్ర లేఖనం పోటీని నిర్వహిం చారు. ఇందులో మొత్తం 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందిస్తారని గ్రంథపాలకుడు డి.కోటేశ్వరరావు తెలిపారు.

నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి -ఉలవపాడు :మండలంలో వివిధ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 7 వాలంటీర్ ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్ బుధవారం చేశారు. అందులో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థులు అప్లికేషన్ దాఖలు చేయవచ్చని తెలిపారు. 16వ తేదీ పరిశీలన 17, 18 తేదీలో ఇంట ర్వ్యూలు జరగనున్నాయి.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ఉలవపాడు :మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని ఆకుతోట సంఘం ఎస్టీ కాలనీలో, కాలనీవాసుల ఆహ్వానం మేరకు సీతారాముల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా జరిగిన కళ్యాణమహోత్సవంలో కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వ రరావు బుధవారం పాల్గొన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నా ప్రసాద్, నాయకులు కత్తి ప్రసాదు, కత్తి నారాయణ, కత్తి వెంకటేశ్వర్లు, కత్తి ఆక్కులు, కొత్తపల్లి శ్రీనివాసులు, కోటేశ్వరరావు, పి శ్రీనివాసులు పాల్గొన్నారు.

15న అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు

తోటపల్లిగూడూరు : కృత్రిమ పరికరాల మంజూరు కోసం ఈ నెల 15వ తేదీన వైకల్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కన్నం హేమలత బుధవారం తెలిపారు. వెంకటాచలం కమ్యూనిటీ హాలులో ఉదయం 10 గంటలకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని ఆమె చెప్పారు. ఈ పరీక్షలకు 40 శాతం పైన వైకల్యం కలిగిన ధ్రువీకరణ పత్రం కలిగిన వారు హాజరు కావాలని హేమలత సూచించారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి కత్రిమ పరికరాలు పొందని వారు మాత్రమే హాజరు కావాలన్నారు. కత్రిమ పరికరాలు పొందేందుకు వయస్సుతో నిమిత్తం లేదని హేమలత తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

తోటపల్లిగూడూరు :మండలంలోని ఇస్కపాలెం పంచాయతీ, టిడిపి సీని యర్ నాయకులు మల్లిశెట్టి సుబ్బరామయ్య (90) బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బరామయ్యకు కుటుంబ సభ్యులు హస్పెటల్ లో చికిత్స ఇప్పిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురైన సుబ్బరామయ్య ఆరోగ్యం విషమించడంతో మృతి చెందారు. సర్పంచ్‌గా సుబ్బరామయ్య పంచాయతీ అభివద్ధి కోసం ఎంతో కృషి చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలతో సుబ్బరామయ్య సత్సం బంధాలు కలిగి ఉన్నారు. దీంతో సుబ్బరామయ్య మృత దేహాన్ని అన్ని రాజకీయ పార్టల నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు :జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. సేవాసమితి కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడారు. శీలం కోటేశ్వరి, జంగాల రవి కోటి, నన్నం సజన, జంగాల మైత్రేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాల్సిందే..!

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- బుచ్చిరెడ్డిపాళెం : అంగన్ వాడీలు చాలీ చాలని వేతనాలతో జీవితాలు కొన సాగిస్తున్నారని, వారికి జీతాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దామరమడుగు, పల్లి పాలెంలో జరుగుతోన్న అంగన్‌వాడీ ఆయాల రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చిలో వేతనాల పెంపు కోసం జరిగిన ఆందోళన సందర్భంగా అసెంబ్లీలో మంత్రి యూనియన్‌తో చర్చించి తెలంగాణ రాష్ట్రం కన్నా ఎక్కువ జీతాలను ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్టం కన్నా ఎక్కువ వేనాతాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసి సిబ్బందిని తగ్గించే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని.. వాటిని కూడా వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఐసిడిఎస్ ప్రాజెక్టును ఎత్తివేసేం దుకు కుట్ర జరుగుతుందన్నారు. అంగన్‌వాడీలందరూ సంఘటితంగా సంఘటితమై ప్రాజెక్టును పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెహనా బేగం, సుజాత, హెల్పర్స్ జిల్లా నాయకులు కామాక్షమ్మ, సంపూర్ణమ్మ, సిఐటియు మండల కార్యదర్శి చల్ల కొలుసు మల్లికార్జున, ఎల్.వి శేషమ్మ, పాల్గొన్నారు.



జగనన్న కాలనీ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నెల్లూరు : కార్పొరేషన్ పరిధిలో జగనన్న కాలనీలో లే అవుట్లలో నిర్మాణ పనుల లక్ష్యాలను వేగ వంతంగా పూర్తి చేసి, గహాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందించాలని అధికారులు, కాంట్రా క్టర్లను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. బుధవారం కమిషనర్ కార్యాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ విభాగం, నగర పాలక సంస్థ అధికారులు, జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణ కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. కమిషనర్ మాట్లాడుతూ నవరత్నాలు పథకంలో భాగంగా పేదలకు అందిస్తున్న గహాల పట్ల ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. టిడ్కో గహాల పంపిణీ కోసం ప్రభుత్వం నిర్దేశించిన యాక్షన్ ప్లాన్ ను అధికారులంతా పటిష్టంగా అమలు చేస్తే లక్ష్యాలను సాధించొచ్చన్నారు. హౌసింగ్ ఈ.ఈ నాగరాజు, డి.ఈ లు శ్రీహరి గోపాల్, దయాకర్, ఏ.ఈ లు, నగర పాలక సంస్థ హౌసింగ్ విభాగం సిద్దిఖ్, సందీప్ పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్'లో తలసేమియా నివారణ దినోత్సవం



ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని రెడ్ క్రాస్ మీటింగ్ హాలులో అంతర్జాతీయ తలసేమియా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.యశోవర్ధన్ మాట్లాడుతూ వైద్యులు ఇతర ఆరోగ్య సంరక్షణ నిపుణులకు తలసేమియా గురించిన తాజా సమాచారం అందించడం, ప్రజలకు తలసేమియా మీద అవగాహన కలిగించాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ తలసేమియా ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ ఎస్.సీత మాట్లాడుతూ రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ నందు నమోదు చేసుకున్నా చిన్నారులందరూ తలసేమియా రహితులుగు మార్చాలని అందుకోసం అందరు సహాయ సహకారాలు అందించాలని కోరారు.. మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమినికి సహకరిస్తున్న సేవా సంస్థలు ఇన లైన్స్ క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని, మహాయాగ ట్రస్ట్, బి.ఎం జి ఫౌండేషన్, సంకల్ప్ ఫౌండేషన్, ప్యూర్ స్మైల్ ఛారిటీస్, డాక్టర్ లను, సేవా భావంతో పనిచేస్తున్న వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ప్యూర్ స్మైల్ ఛారిటీస్ నిర్వాహకులు ఎస్‌కె పర్వీన్, మహాయాగ ట్రస్టు టీం సభ్యుల సహకారంతో అన్నదానం చేశారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-సైదాపురం : పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాక్ హౌజ్ లకు ఎంతో డిమాండ్ ఉందన్నారు. రైతులు ప్యాక్ హౌజ్ ల కోసం తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రైతులకు సబ్సిడీ పై పచ్చ రొట్ట విత్తనాలను రాయితీపై ఇవ్వడం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారిని హైమావతి అన్నారు. ఇరిగేషన్, పంచాయతీ శాఖ ఎఇ, అంగన్వాడి, ఉపాధి హామీ, వెలుగు, విద్యుత్ ఇంకా ఇతర శాఖల అధికారులు తమ శాఖల అభివద్ధి పనులను సమావేశంలో వివరించారు. సమావేశంలో తహశీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీపీ పెంచలమ్మ, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

'విండ్ మిల్ పవర్' ఉత్పత్తికి భూమి పూజ

ప్రజాశక్తి -కందుకూరు



భూమి పూజ చేస్తున్న కంచర్ల రామయ్య

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల వినూత్న ప్రయోగాల అమలులో భాగంగా బుధవారం విండ్ మిల్ విద్యుత్ ఉత్పత్తి స్థాపనకు భూమి పూజ నిర్వహించినట్లు కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. ఆధునిక హైబ్రిడ్ విధానంలో రూపొం దించిన విండ్ మిల్ రాష్ట్రంలో తొలుత ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో స్థాపిస్తున్నట్లు విండ్ టర్బైన్ బాలాజీ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కనకరాజు పేర్కొన్నారు. గ్రీన్ పవర్ లక్ష్యంగా ఈ విండ్ మిల్ రూపొందించినట్లు ఆయన తెలిపారు. కాలేజీలో విండ్ మిల్ విద్యుత్ ఉత్పత్తిని వినియోగించే భవనానికిగ్రీన్ బిల్డింగ్‌గా గుర్తింపు ఇస్తామన్నారు. తొలి (కస్టమర్) వినియోగ దారుగా భారీ రాయితీ కూడా కల్పించామన్నారు. 2000-2005 కిలోవాట్ల ఉత్పత్తి అంచనాలతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం వ్యయ అంచనా రూ. 3 లక్షల ఉంటుందన్నారు. ఉత్పత్తి వ్యయం జీరో కావడంతో విద్యుత్ బిల్లు తగ్గుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు కళ్ల ఎదుట సాక్షాత్కరించాలన్న ధ్యేయంతో విండ్ మిల్ తయారీదారులకు స్వాగతం పలికామని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య వెల్లడించారు. తొలుత టాటా కంపెనీ ద్వారా 60 కేయూ సోలార్ ఏర్పాటు చేసి జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ తో ప్రారంభింప చేశామని, దీని స్ఫూర్తితో యూనివర్సిటీలో పలు విభాగాలను సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ సిహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి హరిబాబు, కాలేజీ అకడమిక్స్ ఇన్‌చార్జి ఎస్ యమ్ మీరావళి, హెచ్‌ఓడిలు ఎంఎం రాయుడు, జి పున్నారావు ఇఇఇ విభాగపు లెక్చరర్లు పిఎం రూప, ఏడుకొండలు, దస్తగిరి, పావని ఉన్నారు.

సీనియారిటీకి న్యాయం

ప్రజాశక్తి -నెల్లూరు :ఏపి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో సిబ్బంది హేతుబద్దీకరణలో భాగంగా జిఒ ఎంఎస్ 32. హెడ్ఎం అండ్ ఎఫ్‌డబ్ల్యు అమలులో (ఎంపిహెచ్ఎ) ప్రాథమిక నియామకపు అంశానికి సంబంధించి బాధితుల విజ్ఞప్తులను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయీస్ యునియన్ (వైఎస్ఆర్‌సిపి అనుబంధం) ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా అధ్యక్షులు వివి.కష్ణారావు, కెవి.కిరణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ దష్టికి తీసుకు వెళ్లడం సంబంధిత అధికారులకు పూర్తి స్థాయి సమాచారంతో వివరించారు. రాష్ట్ర స్థాయి అధికారులు యూనియన్‌కి ఇచ్చిన మాట ప్రకారం 9వ తేదీన ఎంపిహెచ్ఎ (ఎం) నియామకపు క్యాడర్ సీనియారిటీని మాత్రమే సిబ్బంది హేతుబద్దీకరణలో పరిగణలోకి తీసుకోవాలని అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బాధితుల పక్షాన ఆంధ్రప్రదేశ్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఉద్యోగుల హక్కులకి యూనియన్ ఎప్పుడూ అండగ ఉంటుందని జిల్లా అధ్యక్షులు కెవి. కిరణ్ కుమార్ తెలియజేశారు.

షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం

ప్రజాశక్తి-నెల్లూరు :స్పందన వేదిక సమస్యల పరిష్కారాలను సూచించిన ప్రక్రియలో పూర్తి చేయని నగర పాలక సంస్థ పరిధిలోని కోనేటి మిట్ట, రాజా వారి వీధి సచివాలయాల వార్డు ప్లానింగ్ అండ్ రెగులేటరీ కార్యదర్శులకు షో కాజ్ నోటీసులు జారీ చేయమని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు బుధవారం ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంభందించిన సమస్యలకు స్పందన వేదిక ద్వారా పరిష్కారం అందలేదని భావిస్తూ జిల్లా ఆడిట్ విభాగం సమస్యను రీ ఓపెన్ చేశారు. స్పందన విధుల్లో అలసత్వం వహించిన సంబంధిత కార్యదర్శులపై నగర పాలక సంస్థ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయ అధికారులు సూచించారన్నారు.

సీనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ లీగల్ సెల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ ఎ.ప్రవీణ్, ఎస్టాబ్లిష్మెంట్ విభాగం సీనియర్ అసిస్టెంట్ వై. చెంచయ్యను సూపరింటెండెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ వికాస్ మర్మత్ ఉత్తర్వులు జారీచేశారు. కార్యాలయంలో కమిషనర్ చేతులమీదుగా ఉత్తర్వుల పత్రాలను బుధవారం అందుకున్నారు.

16న డెంగీ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 16వ తేది ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీలు, గ్రూప్ సమావేశాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య పిలుపు నిచ్చారు. బుధవారం నగరంలోని డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో జిల్లా సబ్ యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మలేరియా అధికారి డాక్టర్ బిజిత అధికారులు పాల్గొన్నారు.

కార్యదర్శికి అభినందనలు

నెల్లూరు : ఈనెల 1 నుంచి 5 వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన ఎపి కప్ హాకీ పోటీలలో విజయం సాధించిన జిల్లా హాకీ జట్టులో సభ్యుడుగా ఉత్తమ ప్రతిభ చూపిన కొత్తకోట భానుప్రకాష్‌ను కమిషనర్ వికాస్ మర్మత్ ప్రశంసించారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీగా భాను ప్రకాష్ విధులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు కార్యాలయంలో కమిషనర్‌ను బుధవారం కలుసుకుని కప్‌ను అందజేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం :ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మతి చెందిన ఘటన మండలంలోని పోలినేనిపాలెం వద్ద బుధవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు మంగళవారం రాత్రి 9 గంటలకు వలేటి వారిపాలెం నుంచి కందుకూరు వెళ్లే రోడ్డులో కునిపాలెం సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న టోల్ గేటు దగ్గరలో పోలినేని వారిపాలెంకు చెందిన కామేపల్లి మాల కొండయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడపడంతో , ఎదురుగా బైక్ పై వస్తున్న తానికొండ మాధవరావును బలంగా ఢీ కొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. మాధవరావుకు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి బుధవారం ఉదయం తరలిస్తుండగా మతి చెందాడు. మాధవరావు అన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేంద్ర కేసు నమోదు చేశారు. మతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కందు కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-కావలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కావలి పర్యటనకు అధికార యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. హెలిప్యాడ్ నిర్మాణం పూర్తయింది. హెలికాప్టర్ ల్యాండ్ అవడానికి వీలుగా చుట్టూ పక్కల భవనాలపై, స్తంభాలపై జెండాలు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ నుండి ముఖ్యమంత్రి సభావేదిక వరకు ఆర్అండ్‌బి అధికారులు బారికేడ్ల నిర్మాణం చేపట్టారు. వందలాదిమంది కార్మికులు గత మూడు రోజులుగా శ్రమిస్తూ గ్యాలరీ సిద్ధం చేస్తున్నారు. వేదిక వద్ద అధికార యంత్రాంగం వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్యాలరీలో కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం గ్రౌండును చదును చేశారు. మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో పట్టణమంతా పరిశుభ్రతా చర్యలు చేస్తున్నారు.

నాడు-నేడు పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



మనబడి నాడు-నేడు ఫేస్-2 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ బెజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల నాగుల బావి వీధిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న టాయిలెట్ నిర్మాణాలను, క్లాస్‌రూమ్ రిపేర్లు వంటగది ఎలక్ట్రికల్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునప్రారంభం కానున్నాయని తరగతులు ప్రారంభం ముందే చేపట్టే పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యా కమిటీ సభ్యుల సమన్వయంతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలన



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ పరిధిలో ఇళ్ల నిర్మాణాల పురోగతి పెంచడం కోసం బుధవారం స్థానిక పురపాకసంఘ పరిధిలోని నెల్లూరుపాలెం, పమిడిపాడు లేఅవుట్లను కమిషనర్ బి.నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి నిర్మాణం మొదలు పెట్టేందుకు ఆర్థిక పరిస్థితి బాగాలేని లబ్ధిదారులను గుర్తించి వారు ఇంటి నిర్మాణం మొదలు పెట్టేందుకు పొదుపు సంఘాల ద్వారా రూ.35,000 రుణ సహాయం అందించారు. ఇదే క్రమంలో మిగిలిన లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణాలు మొదలు పెట్టేందుకు వారితో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే దిశగా వారికి పూర్తి తోడ్పాటు అందించడం జరుగుతుందని కమిషనర్ తెలియజేశారు. వారివెంట హౌసింగ్ డి.ఇ.నటరాజ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాసిం, మెప్మా సి.ఒ. మాధవి, భేగ్, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి మెమోలు జారీ

ప్రజాశక్తి-ఉదయగిరి

సచివాలయాల్లో నిర్లక్ష్య విధులు నిర్వహిస్తున్న 25 మంది సిబ్బందికి మెమోలను జారీ చేసినట్లు పి.ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలో వివిధ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బయోమెట్రిక్ హాజరు ఉదయం 10:30 గంటల లోపు హాజరు నమోదు చేసి సాయంత్రం 5 గంటలకు మరోమారు హాజరు నమోదు చేయాల్సి ఉండగా మండలంలోని వివిధ సచివాలయాలకు చెందిన 25మంది సాయంత్రం బయోమెట్రిక్ నమోదు వేయలేదని ఆయన తెలిపారు. విధులలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని సంజాయిషీ మెమోలు పంపినట్లు తెలిపారు. ఈ నోటీసులు 3రోజుల్లో ఎంపిడిఒ కార్యాలయంలో స్వయంగా వచ్చి లిఖిత రూపంలో కారణాలు తెలియజేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

కమిషనర్‌కు కౌన్సిలర్ల సన్మానం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావును పలువురు కౌన్సిలర్లు బుధవారం సన్మానించారు. స్థానిక కౌన్సిలర్లు షేక్ మహబూబ్ బాషా, పొడమేకల పెంచలయ్య మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు.

మరమ్మతులకు నోచని కోనేటి కాలువ

ప్రజాశక్తి-అల్లూరు



గుర్రపు డెక్కతో ఉన్న కోనేటి కాలువ

మోపూరు మట్టం ద్వారా రైతులకు సాగునీరు అందించే కోనేటి కాలువ ఏళ్ల తరబడి మరమ్మత్తులకు నోచుకోక పోవడంతో రైతులు ఇరిగేషన్ అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువలో అధికంగా గుర్రపు డెక్క చేరి కిలోమీటర్ పొడవున కాలువకు ఇరువైపులా గట్టు లేకపోవడంతో రైతులు పంట పొలాలకు నీరు పారించుకోవాలంటే నానా అగచాట్లు పడుతున్నారు. నిత్యం చెరువులోకి వెళ్లే పశువులు తొక్కి వేయడంతో కొరుకులు అధికంగా ఉన్నాయన్నారు. కాలువను పూడిక తీయించాలంటే చాలా ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అల్లూరు చెరువులో సమృద్ధిగా నీరు ఉన్నందున చెరువు ద్వారా సాగునీరు ఆయా కాలువలకు వెళుతుందని చెరువులో నీటి పరిమాణం తగ్గితే చాలా అవస్థలు పడతామన్నారు. ఇటీవల రబీ సీజన్‌లో ఆఖరి తడి కోసం విలవిలలాడిపోయామని తెలియజేశారు. ప్రస్తుతం ఎడగారు పంట మొదలైనప్పటికీ కొంతమంది రైతులు విత్తనాలను పంట పొలాల్లో చల్లుకునేందుకు చంకోచిస్తున్నారు. ఈ కోనేటి కాలువ చెరువుకు సంబంధం లేకుండా మోపూరు మట్టం ద్వారా అల్లూరు చెరువుకు సమీపంలోని కాలువ ద్వారా ప్రభుత్వ వైద్యశాల వద్ద ఉన్న కోనేరులోకి సాగునీరు వచ్చి చేరుతుందని రైతులు వివరించారు. అక్కడ నుండి వెంగనగుంట, ఆర్‌డిఆర్ కాలనీ వైపు వెళ్లి 2 పాయలుగా చీలుతుందని తెలిపారు. ఇప్పటికే రైతులందరూ కలిసి చిన్న చిన్న కాలువలను తవ్వుకున్నారు. ఇకనైనా అధికారులు కోనేటి కాలువ పూడికతీతకు సహకరించాలని కోరారు.



మందుబాబులకు అడ్డాగా మారిన సచివాలయ నిర్మాణం (ఫైల్)

మందుబాబులకు అడ్డాగా సచివాలయ నిర్మాణాలు

ప్రజాశక్తి-అల్లూరు

నూతన సచివాలయాల్లో నిత్యం మందుబాబులు రాత్రి, పగలు తేడా లేకుండా మద్యాన్ని సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. పూర్తిగా నిర్మాణాలకు నోచుకోకపోవడంతో మందుబాబులు వీటిని నిత్యం బారుల్లాగా వినియోగించుకుంటున్నారు. అల్లూరుపేటలోని కస్తూరిదేవి పార్కు వద్ద ఉన్న నూతన సచివాలయ భవనం అలాగే చికెన్ మార్కెట్ వద్ద ఉన్న సచివాలయం, అన్న క్యాంటీన్, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బీద మస్తాన్ రావు బస్‌షెల్టర్లలో విచ్చలవిడిగా మద్యాన్ని సేవిస్తున్నారు. ఈ కారణంగా అటువైపుగా వెళుతున్న మహిళలు, విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యాన్ని కొనుగోలు చేసి ఉదయం 6 నుండి మద్యాన్ని పూటుగా సేవిస్తున్నారు. ఈ భవనాలలో గదులను ఏర్పాటు చేసి స్లాబు వేయగా తలుపులు లేని కారణంగా ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, డిస్పోజల్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. ఇకనైనా మందుబాబుల ఆగడాలను కట్టడి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'ప్రతాపన్న' దోపిడీ జగనన్నకు చెబుదాం..

- అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి-కావలి

కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దోపిడీ ఆరాచకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెబుదాం అని కావలి అఖిలపక్ష నేతలు పూటు విమర్శలు చేశారు. బుధవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో అఖిలపక్ష నేతలు పసుపులేటి పెంచలయ్య (సి.పి.ఎం.), చింతల వెంకట్రావు(కాంగ్రెస్), కొప్పర్తి నాగరాజు(సిపిఐ), జ్యోతి బాబురావు(టిడిపి), పొబ్బా సాయిచరిశెట్ (జనసేన) మాట్లాడారు. "జగనన్నకు చెబుదాం!" అని మీ పార్టీ ఒక ప్రోగ్రాం పెట్టారని, అందుకే "జగనన్న మేము చెపుతున్నాం "కావలిలో కబం కంం కబ్జా, అబుదుద్నువు అవినీతి, దిక్కుడిక్కు, దోపిడి పేరుతో ఎంఎల్ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ నాలుగు సంవత్సరాలలో దోపిడీలో రాష్ట్రంలో కావలి రికార్డులు బద్దలు కొట్టారన్నారు. దీనిపై జగన్మోహన్ రెడ్డి దృష్టి సారించాలన్నారు. గతంలో ఇక్కడ



మాట్లాడుతున్న అఖిలపక్షం నేతలు

జరిగిన అవినీతికి కారణం సుకుమార్ రెడ్డి అని పక్కన పెట్టారని చెప్పే ఎంఎల్ఎ ప్రతాప్ రెడ్డి, - సుకుమార్ రెడ్డి ఉన్నప్పుడు టిప్పర్ గ్రావెల్ రూ.4 వేలు అమ్మితే, ఇప్పుడు రూ.7 వేలు అమ్ముతున్నారన్నారు. మరి ఇప్పుడు దోపిడీకి పాల్పడుతున్నవారు ఎవరో తెలపాలన్నారు. అసలు సుకుమార్ రెడ్డి అవినీతి చేసి ఉంటే, దానికి ఎంఎల్ఎ ప్రతాప్ కుమార్ రెడ్డికి సంబంధం లేకపోతే, ఎందుకు ఎంక్వయిరీ వేసి నిజాలు బయట పెట్టలేదని ప్రశ్నించారు. అయితే సుకుమార్ రెడ్డిని పక్కన పెట్టాక కూడా, కావలిలో గ్రావెల్ మాఫియా, ఇసుక మాఫియా కొనసాగుతుందన్నారు. దీనికి కారణం ఎంఎల్ఎ ప్రతాప్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. అలానే కావలిలో ఎంఎల్ఎ ప్రతాప్‌కుమార్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమి లేదని, రోడ్లు, డ్రైయినేజీలు, వాటర్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోనే నాధుడు లేరన్నారు. పెద్ద పవని రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి కానీ, ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందన్నారు. ఆయినా ఎంఎల్ఎ ప్రతాప్‌కుమార్ రెడ్డికి ఇలాంటి సమస్యలు ఏమి పట్టవన్నారు. కావలిలో సామాన్యులు ఏ పని కావాలన్నా ఇన్కమ్ ట్యాక్స్, జిఎస్‌టి లాగా కావలిలో ట్యాక్స్ చెల్లించక తప్పదన్నారు. ఇక్కడ జరిగిన దోపిడీ, భూ కబ్జాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి ప్రతాపన్న చెర నుంచి కావలిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పసుపు లేటి మహేష్, టిడిపి నాయకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన నిలయంగా గ్రంథాలయం

ప్రజాశక్తి-మర్రిపాడు

ప్రతిఒక్కరి జీవితంలో వెల కట్టలేనిది విద్య అని సర్పంచ్ షేక్ బీబీజాన్ అభిప్రాయం పడ్డారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు సలహాలిచ్చారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అమ్మఒడి, విద్యాదీవెన, గోరుముద్ద లాంటి పథకాలను ప్రవేశ పెట్టడమే కాకుండా, వేసవి సెలవుల్లో విద్యార్థుల పఠనాశక్తి, సృజనాత్మక విలువలు పెంపొందించడానికి శిక్షణ శిబిరాలు నిర్వహించడం శ్రద్ధ శక్తులకు నిదర్శనమన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం గోడ పత్రికలను ఆవిష్కరించారు. గ్రామపెద్దలు నారాయణ, శ్రీనివాసులు నాయుడు, తిరుపతినాయుడు పాల్గొన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంఇఒ

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఎంఇఒ షేక్ నజీర్‌బాషా అన్నారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో మండలంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎం.స్నేహలత అనే విద్యార్థిని 586 మార్కులు సాధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటిస్థానంలో నిలవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట శ్రీనివాసులు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థిని ఎం.స్నేహలతకు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసి ఎంఇఒ నజీర్‌బాషా సమక్షంలో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది ఉన్నత స్థానంలో ఉన్నారని అదేవిధంగా ఈ విద్యార్థి కూడా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంఇఒ నజీర్‌బాషా మాట్లాడుతూ గార్లపాటి ఫౌండేషన్ వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో ప్రతియేటా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు చదువుల కోసం అందిస్తున్న ప్రోత్సాహం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఎంతటి ఘన విజయం సాధించినందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు తోట శ్రీనివాసులను సన్మానించారు. విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో మల్లికార్జున, ఉపాధ్యాయులున్నారు.



విద్యార్థుల కోసం విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-సీతారామపురం

విద్యార్థులకు ఇచ్చిన సుదీర్ఘ వేసవి విరామాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడానికి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించినట్లు లైబ్రేరియన్ గౌస్‌బాషా తెలిపారు. మే 8వ తేదీ నుండి జూన్ 11వ తేదీ వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు విద్యార్థులు పఠనా సామర్థ్యం కోల్పోకుండా ఎండ తీవ్రత నుండి తప్పించుకొని విజ్ఞానాన్ని పొందడానికి ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ వేసవి శిబిరంలో పిల్లలు కథలు వినడం, చదవడం, పుస్తక సమీక్షలు, పెద్దలు చెప్పిన కథలు విని చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు మధ్యాహ్నం వరకు నిర్వహిస్తామని తెలిపారు. కాబట్టి విద్యార్థులు ఈ వేసవి శిబిరాలకు హాజరై సృజనాత్మకతను పెంపొందించుకోవాల్సిందిగా ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బాలచంద్రుడు, గ్రంథాలయ పాఠకులు వెంకటేశ్వరరాజు, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రానికి గుండెమడకల క్లస్టర్‌కు చెందిన రైతులు 974పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 935బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 16పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. అధిక బరువుతో ఉన్న 23పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారని, వీటిలోఎన్ఎస్ 07సి ఆర్07ఆర్ ఆర్ 02ఉన్నాయని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.200 కాగా కనిష్ఠ ధర రూ.175, సగటు ధర రూ.197.04 నమోదు కాగా, వేలంలో 10మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.



రామతీర్థంలో వేలం నిర్వహణ

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో ఉన్న శ్రీ కామాక్షి దేవి సమేతా శ్రీ రామలింగేశ్వర స్వామి జూన్ 9వ నుంచి 19వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి వేలం పాటలు బుధవారం ఈవో రామకృష్ణ, చైర్మన్ చంద్రయ్య, వైసిపి మత్స్యకార నాయకులు ఆవుల వాసు నిర్వహించారు. గతంలో కంటే దేవాలయానికి వేలంతో ఆదాయం పెరిగిందని, బ్రహ్మోత్సవాలు సమయంలో అత్యంత వైభవంగా భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా నిర్వహిస్తామని ఈవో రామకృష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, దేవాలయ డైరెక్టర్లు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని కల్లు, ప్రభుత్వ మద్యం దుకాణాలలో నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రికార్డులను, మద్యం బాటిళ్లను, కల్లు నమూనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మర్రిపాడు, ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు తదితర ప్రాంతాలలో ఉన్న కల్లు దుకాణాలు, ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్లు దుకాణాన్ని నడుచుకోవాలని నాణ్యత ప్రమాణాలు పాటించాలని కల్లు దుకాణ ఎఫ్‌టిఎఫ్‌లకు సూచనలు చేస్తున్నామన్నారు. మద్యం దుకాణాల్లో అమ్మకాలు జరిపిన నగదును మరుసటి రోజు క్రమం తప్పకుండా సక్రమంగా బ్యాంకులో జమ చేయాలన్నారు. బ్యాంకులో జమ చేసిన నగదు రసీదులను క్షుణ్ణంగా పరిశీలించా మన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయం ప్రకారం షాపులను నిర్వహించాలన్నారు. అదే విధంగా



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

రికార్డులలో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలన్నారు. ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసే అమ్మాలన్నారు. మద్యం బాటిళ్లను ఎంఆర్‌పి కంటే ఎక్కువకు అమ్మరాదని, అట్లు అమ్మిన వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీలలో నెలకు నాలుగుసార్లు దుకాణంలోని స్టాక్‌ను తప్పకుండా స్కాన్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఆదేశాలను కాదని దుకాణంలో పనిచేసే సిబ్బంది వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సిబ్బంది మాల కొండయ్య ఉన్నారు.

టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీ రక్షిత మంచినీటి పథకం నీటి శుద్ధి కేంద్రంలో టెక్నీషియన్‌ను నియమించి శుద్ధి చేసిన రక్షిత మంచి నీటిని పట్టణ ప్రజలకు అందించాలని ఆత్మకూరు సిపిఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నీటి సమస్యను కమిషనర్‌కు వివరిస్తూ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే విధంగా ప్రతిష్టాత్మకంగా సోమశిల ప్రాజెక్ట్ నుండి ఆత్మకూరుకు పైపులైన్ ద్వారా ఆత్మకూరు కేంద్రంలో నీటిని శుద్ధి చేసి తగిన మోతాదులో క్లోరినేషన్ ప్రక్రియ చేసి పట్టణ ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలని సంకల్పంతో చేపట్టిన ఈ పథకంలో నీటి శుద్ధి కేంద్రంలో క్వాలిఫైడ్ శుద్ధి టెక్నీషియన్ లేకుండానే అన్‌స్కిల్ వర్కర్స్‌తో ఈ పని చేయించడం ప్రజల ఆరోగ్యానికి హానికరం నీటి శుద్ధి నిర్వహణలో జరిగే లోపాలతో తరచూ నీటి కలుషితంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పాలకవర్గం అధికారులు నీటి శుద్ధి కేంద్రంలో క్వాలిఫైడ్ టెక్నీషియన్ నియామకం విషయంలో నిర్లక్ష్యంతో వ్యవహరించడం చాలా బాధాకరం ఇప్పటికైనా



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మున్సిపల్ కమిషనర్‌గా తమరు స్పందించి నియామకానికి తగిన చర్యలు తీసుకోవాలని రక్షిత మంచి నీరును ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన నాగేశ్వరరావు సంబంధిత అధికారి ఏఈ ప్రసాద్‌తో మాట్లాడి టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, డివైఎఫ్ఐ నాయకులు నంద శీను, సిపిఎం నాయకులు రమణయ్య, జయకుమార్, పోలయ్య, నతానీ, శ్రీకాంత్, తదితరులున్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-కావలి

కావలిలో 12వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా బహిరంగ సభకు వచ్చే లబ్ధిదారులకు, సభికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. బుధవారం సభా వేదిక వద్ద గ్యాలరీ ఇన్‌ఛార్జి అధికారులతో సమీక్ష చేశారు. వేలాదిమంది ప్రజలు ముఖ్యమంత్రి సభకు వస్తున్నందున 40 గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో గ్యాలరీకి ఒక మండల స్థాయి అధికారితో పాటు పదిమంది సిబ్బందిని నియమించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వచ్చిన వారందరికీ తాగునీరు, స్నాక్స్ అందించి, కావాల్సిన సౌకర్యాలు కల్పించడం తదితర అంశాలపై దిశా నిర్దేశం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

చేశారు. గ్యాలరీకి ఓవరాల్ ఇన్‌ఛార్జులుగా జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి, పిడి డిడబ్ల్యూఎం ఎ వెంకటరావును నియమించామన్నారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, జెడ్‌పి సిఇఒ, పిడి డిడబ్ల్యుఎంఎ తదితర అధికారులు పాల్గొన్నారు.



యువతకు ఫుట్‌బాల్ కోచింగ్

ప్రజాశక్తి-బిట్రగుంట

బిట్రగుంట వాకర్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి సహ

కారంతో బుధవారం బిట్రగుంట రైల్వే వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ సమ్మర్ క్రీడలను బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వే డిఎంఒ బిట్రగుంట, డాక్టర్ పి.సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ శశికుమార్, గౌరవ అధ్యక్షుడు ఎకె సుందర్‌రాజ్ మాట్లాడుతూ ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపు బుధవారం నుండి నెలరోజుల పాటు విద్యార్థులకు శిక్షణను సీనియర్ ఆటగాడు మేకల కిరణ్ కుమార్ ఇస్తారని తెలిపారు. శిక్షణ కాలం అనంతరం జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ద్వారా ధృవీకరణ పత్రం అందించబడుతుందన్నారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ద్వారా శిక్షణలో పాల్గొన్న పిల్లలకు ప్యాంట్లు, జెర్సీలు బహూకరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చప్పిడి రవి, సీనియర్ ఆటగాడు చీకటి నాగరాజ్, బర్నర్డ్, బత్తల రవిచంద్ర, సత్యనారాయణ ఆచార్యులు, గుత్తి సుధాకర్, సుభాని అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నూతన దంపతులకు కన్నబాబు ఆశీర్వాదం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని తిమ్మానాయుడుపేట గ్రామ టిడిపి నాయకులు ఆవులపోలు పెద్దన్న కుమారుడు సాయిప్రసాద్-సాగరికల వివాహ కార్యక్రమానికి హాజరుకాలేక పోయిన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీ కన్నబాబు బుధవారం వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనవెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మండలం అధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మండల బిసి నాయకులు ఎలగాల వెంకటేశ్వర్లు యాదవ్, మండలం ప్రధానకార్యదర్శి కర్యావుల శ్రీనివాసులు యాదవ్, ఎఎస్‌పేట అధ్యక్షులు అబ్బూరి రమేష్ నాయుడు, మండలం మాజీ వైస్ ఎంపిపి దేవరాల హజరత్ బాబు, పెద్దబ్బీపురం పంచాయతీ సర్పంచ్ అల్లంపాటి మాధవ్ రెడ్డి, ఆత్మకూరు సీనియర్ నాయకుడు వల్లూరు వెంకట రమణారెడ్డి, అనంతసాగరం యువ నాయకుడు చల్లా నరసారెడ్డి, చంద్రబాబు నాయుడు, శాఖపురం సురేష్, తదితరులున్నారు.

ఆధారాలు అందించాలి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట దర్గా మాజీ సజ్జాదా అఫీష్ పాషాపై వచ్చిన అభియోగాలపై ఇరు పక్షాలు తవవద్ద ఉన్న ఆధారాలను అందించాలని విచారణ అధికారి ఎకె నజీర్‌సాహెబ్ కోరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఆధారాల కార్యక్రమం ప్రారంభమైంది. తొలుత హఫీజ్ తన వద్దనున్న ఆధారాలను విచారణ అధికారికి అందించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ ఐద్వా కమిటీ మెంబర్లతో కలిసి విచారణ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌బీ మాట్లాడుతూ దర్గా, ఎఎస్‌పేటలో యాత్రికులకు మహిళలకు రక్షణ కల్పించాలని తెలిపారు. అనంతరం అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి రషీద్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి మూలి వెంగయ్య, గంట లక్ష్మిపతితో కలిసి విచారణ అధికారిని కలిసి పలు ఆధారాలను అందించారు. అనంతరం మండల సిపిఎం కార్యదర్శి అస్లామ్, గౌష్ బాషాతో కలసి ఎఎస్‌పేటలో జరిగిన సంఘటనల గురించి పలు ఆధారాలను అందించారు.



ఆధారాలు సమర్పిస్తున్న అవాజ్ నాయకులు

హఫీజ్‌కు సంబంధించిన స్థానికతపై ఆధారాలను విచారణ అధికారికి అందించినట్లు గౌస్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పేట అవాజ్ కమిటీ కార్యదర్శి నిసార్ అహ్మద్, షేక్ సంశాద్, షేక్ ఎస్థాని, గుడిపాడు సిపిఎం నాయకుడు వేణుగోపాల రెడ్డి, శ్యామలమ్మ, గ్రామ ముస్లీం నాయకులు తదితరులు పాల్గొన్నారు. విచారణ అధికారి మాట్లాడుతూ దర్గాకు సంబంధించిన జమ ఖర్చుల వివరాలను హఫీజ్ అందించలేదని తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు తాగునీరుని అందించాలని జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని అప్పసముద్రం గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాలలో కూలీలకు నీడను కల్పించి వడదెబ్బలకు గురికాకుండా మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో తాగునీరు ఉంచాలని ముఖ్యంగా రోజు వారి వేతనం రూ.250 పడేటట్లు చూడాలని పనులు కోరిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఇసి శ్రీనివాసులను ఆదేశించారు. ముందుగా ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడి సమస్యలను తెలుసుకొని ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవినీతి ఆర్జనలో రామిరెడ్డి రికార్డ్..

ప్రజాశక్తి-కావలి

చుక్కల భూముల సమస్యపై 2018లో టిడిపి ఇబ్బంది పెడితే, 2019 నుంచి 2023 వరకు ఎంఎల్ఎ ఏమి చేస్తున్నారో చెప్పాలని, అవినీతి అర్జనలో కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్టేట్ ఫస్ట్ రికార్డు సాధించారని జనసేన నాయకులు సిద్ధు విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చుక్కల భూముల సమస్యపై గతంలో జెడ్‌పి సమావేశంలో గొంతెత్తి మాట్లాడింది రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని, దీనిపై ఆయన అధికారులకు అల్టిమేటం ఇచ్చారన్నారు. అధికారులు ఈ సమస్యను సరి చేస్తున్నట్లు కలెక్టర్, ఆర్‌డిఒ ప్రెస్‌మీట్లుపెట్టీ మరీ చెప్పారన్నారు. షాడో ఎంఎల్ఎ ఉన్నప్పుడే టిప్పర్ గ్రావెల్ రూ.3 వేలకు దొరికేదని, ఇప్పుడు ఎంఎల్ఎ ఛార్జ్ తీసుకున్నాక టిప్పర్ గ్రావెల్ రూ.6వేలకు అమ్ముతున్నారని ఆరోపించారు.ఇంటి నిర్మాణాలు చేపట్టే వారిని ఎవరనడిగినా ఈ విషయం చెబుతారన్నారన్నారు. ఎంఎల్ఎ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో తోట శేషయ్య, కావలి రూరల్ మండల అధ్యక్షులు తిరుపతి స్వామి, బోగోలు మండల నాయకులు ఆలూరి చంటి, మనోజ్, తోట సాయి, వాహిద్, విష్ణు, విజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.